సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం, 18, డిసెంబర్, 2024



మన్యంపై చలి పంజా

రోజురోజుకు చలితీవ్రత పెరుగుతోంది. మంగళవారం అరకువ్యాలీ, జి.మాడుగులలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 8లో



నాణ్యమైన విద్య అందించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆదేశించారు. 8లో



గురుకుల విద్యార్థుల ఆందోళన

గురుకులాల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. 8లో

న్యూస్‌రీల్

పొల్లూరు, డొంకరాయిలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం

- మొరాయించిన యూనిట్లకు మరమ్మతులు

మోతుగూడెం: పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో సాంకేతిక సమస్యలు కారణంగా నిలిచిన విద్యుత్ ఉత్పత్తిని ఏపీ జెన్‌కో అధికారులు పునరుద్ధరించారు. రెండవ యూనిట్ ట్రాన్స్‌ఫార్మర్ లోపాలను సవరించి ఉత్పత్తిని మొదలు పెట్టారు. జెన్‌కో ఇంజనీర్లు, ఉద్యోగులు ఎంతో శ్రమించారు. దీంతో 460 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. డొంకరాయిలో యూనిట్ లోపాలను సవరించి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించారు. త్వరలో పొల్లూరు నాల్గవ యూనిట్ సమస్యను పరిష్కరించి పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తికి చర్యలు తీసుకుంటున్నామని జెన్‌కో ఇంజినీరింగ్ అధికారవర్గాలు తెలిపాయి.

సమస్యలపై నిరంతర పోరాటం



నూతన కమిటీతో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

రంపచోడవరం: గిరిజన, కార్మిక, కర్షక సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శిగా బొప్పెన కిరణ్ అన్నారు. మంగళవారం సీపీఎం జిల్లా నూతన కమిటీ ఎన్నిక జరిగింది. జిల్లా కార్యదర్శిగా బొప్పెన కిరణ్, కార్యదర్శి వర్గ సభ్యులుగా లోతా రామారావు, మట్ల వాణిశ్రీ, మర్లపాటి నాగేశ్వరరావు, పల్లపు వెంకట్, సున్నం రాజులు నియమితులయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా పులి సంతోష్ కుమార్, సోయం చిన్నబాబు , సురేష్, కాకా అర్జున్, మేక నాగేశ్వరరావు, కాయం సీతారామయ్యబాబును నియమించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ జిల్లాలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. వారిని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు అభినందించారు.

రాష్ట్ర సరిహద్దుల్లో వాహన తనిఖీలు



వాహనాల పత్రాలను పరిశీలిస్తున్న ఆర్టీవో చెల్లారావు

ఎటపాక: ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ అధికారులు మంగళవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఎటపాక మండలం రాయనపేట సమీపంలో జాతీయరహదారి పై ఆర్టీవో చెల్లారావు తెలంగాణ రిజిస్ట్రేషన్ వాహనాల పత్రాలను పరిశీలించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే చర్యలు తప్పవని వ్యాన్ల డ్రైవర్లను హెచ్చరించారు. అధికలోడుతో వెళ్తున్న జామాయిల్ కలప ట్రాక్టర్లను నిలిపి వాహన పత్రాలు,డ్రైవర్ లైసెన్సులను పరిశీలించారు. రాష్ట్ర విభజన తరువాత తెలంగాణ రిజిస్ట్రేషన్ కలిగి ఆంధ్రాలో తిరుగుతున్న వాహనాల పత్రాలు మార్చుకోవాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని వాహనదారులను హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో అట్టి వాహనాల రిజిస్ట్రేషన్ల కారణంగా అనేక ఇబ్బందులు తలెత్తుతాయని చెప్పారు. నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

విద్యా ప్రమాణాల మెరుగుకు చర్యలు




విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మజీరావు

చింతపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలను మెరుగుపరచాలని జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మజీరావు సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని బెన్నవరం ఎంపీయూపీఎస్ పాఠశాల, అంజలీశనివారంలోని ఏపీ గురుకులం, తాజంగిలోని కేజీబీవీ చింతపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరుతోపాటు పాఠశాల రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం మెనూను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు ప్రసాద్, బోడంనాయుడు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కొత్తపల్లి జలపాతం వద్ద ఆకర్షణీయంగా బోర్డు



కొత్తపల్లి జలపాతం



మెట్ల మార్గంలో అలంకరణ దీపాలు

ప్రకృతి సోయగం.. కొత్తపల్లి వైభవం

కారడవిలోంచి ఆనందం పంచే స్థాయికి..

- జలపాతం అభివృద్ధికి ఎంతో కష్టపడిన గ్రామస్తులు
- శ్రమదానంతో మట్టి మెట్లు, చెట్లు నరికి మార్గం ఏర్పాటు
- గత 15 ఏళ్లుగా అంచెలంచెలుగా అభివృద్ధి
- తాజాగా .1.20 కోట్లతో సుందరీకరణ చేపట్టిన ఐటీడీఏ
- ముమ్మందు మరింత అభివృద్ధి చేస్తాం: పీవో అభిషేక్

జి.మాడుగుల: దట్టమైన అటవీ ప్రాంతం..ఎటు చూసినా బండరాళ్లు.. వాటిమీదుగా కొండకోనల్లోంచి వచ్చే సెలయేళ్ల పరవళ్లు.. ఇలాంటి అందమైన జల సోయగం ఉందన్న విషయం పదిహేనేళ్ల క్రితం వరకు బాహ్యప్రపంచానికి తెలియదు. అప్పటివరకు అడవిలో కాచిన వెన్నెల మాదిరిగా ఉండిపోయిన ఈ ప్రకృతి అందాన్ని కొత్తపల్లి గ్రామస్తులు వెలుగులోకి తెచ్చారు. అక్కడికి వెళ్లేందుకు కాలిబాట కూడా లేకపోవడంతో వారంతా అష్టకష్టాలు పడి రహదారి నిర్మించారు. శ్రమదానంతో రోజులతరబడి శ్రమించి జలపాతం వద్దకు మట్టి మెట్లు, రక్షణగా వెదురు కర్రలు ఏర్పాటుచేశారు. రాకపోకలు సాగించేందుకు వీలుగా పెద్ద చెట్లును నరికి బండరాళ్లపై ఉంచారు. ఇలా మార్గం ఏర్పాటు కావడంతో ఈ అపురూప అందాలను తిలకించేందుకు పర్యాటకులు క్యూ కట్టారు. దీంతో అభివృద్ధిపై కాంగ్రెస్ సర్కారు దృష్టి పెట్టింది. అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో గిరిజన సంక్షేమశాఖ మంత్రి పసుపులేటి బాలరాజు, ఐటీడీఏ అధికారులు గ్రామస్తులతో సమావేశమయ్యారు. రూ.కోటితో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అప్పటినుంచి అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతోంది. ఈ నేపథ్యంలో పాడేరు ఐటీడీఏ రూ.1.20 కోట్లు వెచ్చించి పర్యాటకులను ఆకట్టుకునేలా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. ఈ నిధులతో మట్టిరోడ్డును సిమెంట్ రోడ్డుగా అభివృద్ధి చేసింది. స్వాగత ద్వారం, వ్యూ పాయింట్, ఐలవ్ కొత్తపల్లి వాటర్‌పాల్స్ నమూనాలు పర్యాటకుల మదిని దోచేలా ఏర్పాటుచేసింది. వివిధ రంగుల్లో ఏర్పాటుచేసిన జిగ్‌జాగ్ లైటింగ్‌కు పర్యాటకులు మంత్రముగ్ధులవుతున్నారు. పర్యాటక శాఖ నిధులతో ముమ్మందు మరింత అభివృద్ధి చేస్తామని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు.



ఆధునికీరణలో భాగంగా నిర్మించిన రోడ్డు



విద్యుత్ దీప కాంతుల్లో మెట్ల మార్గం

రెవెన్యూ రాజకీయ సదస్సా?

- అధికారులకు కుర్చీల్లేకుండా కూర్చున్న కూటమి నేతలు
- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల అనుచరులతో నిండిపోయిన కలెక్టరేట్
- సమస్యలు తెలిపేందుకు ఇబ్బంది పడిన రెవెన్యూ అధికారులు
- సదస్సుకు దూరంగా ఎమ్మెల్యే గంటా





వెనుక వరుసలో కూర్చున్న కూటమి ద్వితీయశ్రేణి నేతలు

సాక్షి, విశాఖపట్నం : జరిగిందేమో ఉత్తరాంధ్ర జిల్లాల రెవెన్యూ సదస్సు.. సమావేశ మందిరంలో కనిపించిందేమో కూటమి పార్టీల దిగువస్థాయి నేతలు. అధికారులు కూర్చునేందుకు చోటు లేకపోయినా.. మేం బయటికి వెళ్లం.. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటే మేమూ కూడా అంటూ సదస్సు ఆద్యంతం ఉన్నారు. తామంతా రెవెన్యూ సదస్సుకు వచ్చామా.? కూటమి నేతల రాజకీయ సదస్సుకు వచ్చామా అనే సందేహంతోనే రెవిన్యూ అధికారులు రోజంతా కాన్ఫరెన్స్‌లో సర్దుకొని కూర్చున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఆర్డీవోలతో కలెక్టరేట్ సమావేశమందిరంలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మంగళవారం రీజనల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. రెవెన్యూ పరిధిలో సమస్యలు పరిష్కారం, భూముల రీ సర్వే, 22ఏ, ఫ్రీ హోల్డ్, గ్రామ సభలు, పీజీఆర్‌ఎస్.. తదితర అంశాలపై సమీక్షలో చర్చించారు. ఈ సదస్సుకు మంత్రులు, అధికారులతో పాటు ఆయా జిల్లాల ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు మాత్రమే పాల్గొనే అవకాశం ఉంది. ఇంకెవరూ ఆ సదస్సులో ఉండటానికి అర్హులు కారు. కానీ.. కాన్ఫరెన్స్‌లో అధికారులకు సైతం చోటు లేకుండా.. కూటమి పార్టీల నేతలతో హాల్ నిండిపోయింది. ఒకానొక సమయంలో ఆర్డీవోలకు చోటు లేకపోవడంతో.. మళ్లీ కుర్చీలు తెచ్చి సర్దుకోవాల్సి వచ్చింది. ఇంత జరుగుతున్నా.. తమ అనుచరుల్ని బయటకు వెళ్లమని మంత్రులు గానీ, ఎమ్మెల్యేలు గానీ చెప్పలేదు. సమావేశానికి ఆహ్వానం లేని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, నామినేటెడ్ పోస్టు హోదాలో ఉన్న సీతంరాజు సుధాకర్, జనసేన చోటా నాయకుడు చంద్రరావు, బీజేపీ నేత శ్రీరామమూర్తి.. ఇలా దిగువ స్థాయి నేతలంతా హాల్‌లోనే ఆద్యంతం ఉన్నారు. ఎమ్మెల్యేలు తమ పరిధిలో ఉన్న వ్యవహారాలపై మాట్లాడుతుంటే.. చోటా నాయకులు మధ్యలో కలగజేసుకొని మాట్లాడుతుండటంతో అధికారులు అసహనం వ్యక్తం చేశారు. తమ పరిధిలో కూటమి నేతల వల్ల ఎదురవుతున్న సమస్యలు మంత్రి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా దృష్టికి తీసుకెళ్లాలని భావించినా.. జిల్లా, మండల స్థాయి నాయకులు సదస్సులో ఉండటంతో.. వారి వ్యవహారాలు బయటపెట్టేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మొత్తంగా రెవెన్యూ సదస్సును కూటమి నేతలు రాజకీయ సదస్సుగా మార్చేశారు. ఇదిలా ఉండగా.. కీలకమైన సదస్సుకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు డుమ్మా కొట్టారు. రెవెన్యూ విభాగంలో తన మాట చెల్లుబాటు కాకపోవడంతోనే గంటా గైర్హాజరైనట్లు కూటమి నేతలే చెబుతుండటం కొసమెరుపు.

181 న్యూట్రీ గార్డెన్లు మంజూరు

మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ సూర్యలక్ష్మి



మాట్లాడుతున్న పీడీ సూర్యలక్ష్మి, చిత్రంలో ఎంపీపీ, ఎంపీడీవో, ఎస్‌ఐ తదితరులు

కొయ్యూరు: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు రెండో దఫా 181 న్యూట్రీ గార్డెన్లు మంజూరు అయ్యాయని మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ సూర్యలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె రాజేంద్రపాలెం గిరిజన భవన్‌లో నిర్వహించిన కిశోరి వికాసం అవగాహన సమావేశానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ న్యూట్రీ గార్డెన్లకు సంబంధిత అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త ఖాతాలో రూ.10 వేలు ప్రభుత్వం జమచేస్తున్నట్టు ఆమె వివరించారు. అంతేకాకుండా ప్రతీ అంగన్‌వాడ ఈకేంద్రం వద్ద ఇంకుడు గుంతను ఏర్పాటుచేస్తారని, ఇందుకు రూ.16 వేలు చెల్లిస్తారని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల వద్ద తాగునీటికి రూ.17 వేలు. టాయిలెట్ల నిర్మాణానికి రూ.36 వేలు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. ఈ మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు. విద్యుత్ సౌకర్యం లేని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒక బల్బు, ఫ్యాన్, మీటరు విద్యుత్ శాఖ ఏర్పాటుచేస్తుందన్నారు. అల్లూరి జిల్లా ఏర్పాటైన నాటి నుంచి ఇప్పటి వరకు 22 బాల్య వివాహం కేసులు నమోదయ్యాయని తెలిపారు. విద్యతోనే బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయగలమన్నారు. గ్రామాల్లో ముందుగానే వివాహాలు చేసుకోబోయే వారి వయసులను మహిళా సంరక్షణ కార్యదర్శి నిర్ధారిస్తారన్నారు. బాల్య వివాహాల అనర్థాలపై ప్రతీ మొదటి సోమవారం గ్రామ స్థాయిలో అవగాహన కల్పిస్తారనన్నారు. ఎంపీపీ రమేష్ మాట్లాడుతూ గంజాయి వల్ల కలిగే అనర్థాలపై కూడా అవగాహన కల్పించాలని కోరారు. మంప ఎస్‌ఐ శంకర్ పోక్సో చట్టంపై అవగహన కలిపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, వెలుగు ఏపీఎం సాధన, సీడీపీవో విజయకుమారి, సర్పంచ్ పీటా సింహాచలం పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితులను నట్టేట ముంచి ప్రాజెక్టు నిర్మాణమా?

- అలా జరిగితే వారికి అండగా ఉండి నిలదీస్తాం
- ప్రాజెక్టును సందర్శించి నిర్వాసితుల గురించి మాట్లాడని సీఎం చంద్రబాబు
- రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటు చేయాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

రంపచోడవరం : పోలవరం నిర్వాసితులను నట్టేట ముంచి ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేద్దామని ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని, అలా జరిగితే బాధితులకు అండగా సీపీఎం నిలుస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. రంపచోడవరంలో జరిగిన సీపీఎం జిల్లా మహాసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించడానికి వచ్చిన సీఎం చంద్రబాబు ప్రాజెక్టు నిర్మాణం, డయాఫ్రం వాల్, స్పిల్‌వే పనులకు సంబంధించి సమీక్షించారని, నిర్వాసితుల పునరావాసం గురించి విస్మరించారని పేర్కొన్నారు. సమీక్ష అంటే పోలవరం ముంపు గ్రామాల్లో పర్యటించి అక్కడ ఉన్న గిరిజనుల సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరించే విధంగా ఉండాలన్నారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం కేటాయించిన రూ.55 వేల కోట్లలో రూ.33 వేల కోట్లు నిర్వాసితులకు పునరావాసం కల్పించడానికేనని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో నిర్వాసితుల సమస్యలను విస్మరించి ప్రాజెక్టు నిర్మాణంపైనే ప్రభుత్వాలు దృష్టి సారించడం సరికాదన్నారు. వారి దృష్టిలో ప్రాజెక్టు నిర్మాణం అయితే అంతా అయిపోయినట్టే భావిస్తున్నారని, నిర్వాసితులకు ఒకేసారి పునరావాసం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వస్తే నిర్వాసితుల సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్వాసితుల గురించి పట్టించుకోవడం లేదని ఆక్షేపించారు. రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లాను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జిల్లా కేంద్రం పాడేరు వెళ్లేందుకు 400 కిలోమీటర్ల మేర ప్రయాణం చేయాల్సి వస్తోందన్నారు. సీఆర్‌టీలు చేస్తున్న నిరసనలకు సీపీఎం మద్దతు తెలుపుతున్నట్లు ఆయన వెల్లడించారు.

రెవెన్యూ సదస్సులకు స్పందన కరువు



కించుమండలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఖాళీగా కుర్చీలు



అధికారులను ప్రశ్నిస్తున్న గిరిజనుడు

- మొక్కుబడిగా నిర్వహణ
- ఆసక్తి చూపని గిరిజనులు

డుంబ్రిగుడ: రెవెన్యూ సదస్సులకు స్పందన కరువైంది. మొక్కుబడిగా నిర్వహించడం వల్ల ప్రజలు లేక వెలవెలబోతున్నాయి. మంగళవారం కించుమండలో నిర్వహించిన రెవెన్యూ సదస్సు ఇందుకు ఉదాహరణ. గత ప్రభుత్వ హయాంలో భూరీసర్వే పేరిట కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. సాగుదారులకు సర్వహక్కుల కల్పనకు గత ప్రభుత్వం సమగ్ర సర్వేతో భూహక్కు పత్రలను కూడా గిరిజన రైతులకు అందజేసింది. కొన్ని గ్రామాల్లో సర్వే జరిగినప్పటికీ కొంత మంది గిరిజన రైతులకు శాశ్వత హక్కు కల్పించాల్సి ఉంది. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రావడంతోపాటు ప్రభుత్వం మారడం ఈ కార్యక్రమంపై తీవ్ర ప్రభావం చూపింది. సర్వే నిలిచిపోయింది. ఈక్రమంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పరిష్కారానికి వినతులు అందజేస్తున్నా ప్రయోజనం కనిపించడం లేదని గిరిజనులు వాపోతున్నారు. దీంతో సదస్సులకు వచ్చేందుకు ఆసక్తి చూపించడం లేదు. కించుమండ పంచాయతీ కుసుమవలస, సొవ్వ పంచాయతీ కొరాంజీగుడలలో నిర్వహించన సదస్సులకు కనీసం 20 మంది కూడా గిరిజన రైతులు హాజరుకాకపోవడమే ఇందుకు ఉదాహరణ అని పలువురు పేర్కొంటున్నారు.

ఆగని తీరం కోత



కోతకు గురవుతున్న సముద్రతీరం

ఏయూక్యాంపస్(విశాఖ): సముద్రతీరంలో కోత ఆగడం లేదు. సాధారణంగా వాతావరణ మార్పులు జరిగిన సమయంలో కోతకు గురవడం, తర్వాత యథాస్థితికి రావడం మనం చూస్తున్నాం. అయితే ప్రస్తుత పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. వైఎంసీఏ ఎదురుగా ఉన్న ప్రాంతం నుంచి కురుసుర సబ్‌మెరైన్ ఉన్న ప్రాంతం వరకు తీరం భారీగా కోతకు గురైంది. గతంలో ఇదే ప్రాంతం కోతకు గురవడంతో అక్కడ నాటిన కొబ్బరి చెట్లకు ముప్పు వాటిల్లింది. కోతను అడ్డుకోవడానికి తీరానికి, కొబ్బరి చెట్లకు మధ్య రాళ్లు వేసి, చుట్టూ ఇనుప మెష్ వేశారు. ప్రస్తుతం కెరటాల ఉధృతికి ఈ రాళ్లు జారిపోయే ప్రమాదం నెలకొంది.

కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలి

- గురుకులాల అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల డిమాండ్
- యూటీఎఫ్ ఆధ్వర్యంలో రంపచోడవరం ఐటీడీఏ ముట్టడి
- ఉద్యోగులు కార్యాలయంలోకి వెళ్లకుండా అడ్డగింపు



ఆందోళన కారులు అడ్డుకోవడంతో గేటువద్ద ఉండిపోయిన డీడీ విజయశాంతి



ఐటీడీఏ ముట్టడిలో పిల్లలతో పాల్గొన్న మహిళా ఉద్యోగులు

రంపచోడవరం: గురుకులాల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం ఐటీడీఏ ముట్టడి చేపట్టారు. దీనిలో భాగంగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, యూటీఎఫ్ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఐటీడీఏ కార్యాలయంలోకి వెళ్లకుండా ట్రైబల్ వెల్ఫేర్ డీడీ విజయశాంతిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ సబ్ కమిటీ కన్వీనర్ కె.ఆదిరెడ్డి మాట్లాడుతూ 2022 పీఆర్‌సీ ప్రకారం గురుకుల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 2024 డీఎస్సీ నుంచి వారి పోస్టులు మినహాయించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు చేస్తున్న న్యాయమైన డిమాండ్లకు ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలని కోరారు. రాష్ట్రంలో ఏ గురుకులాల్లో కూడా ఈ ఔట్‌సోర్సింగ్ విధానం లేదని, ఒక్క గిరిజన గురుకులాల్లో మాత్రమే అమలవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు పరిచి వెంటనే సీఆర్‌టీ కాంట్రాక్టు విధానంలోకి మార్చాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. గురుకులాల్ని నమ్ముకుని 20 ఏళ్లుగా పనిచేస్తున్నామని ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారన్నారు. ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులను ఇతర జిల్లాలకు పంపడం సరికాదని, వెంటనే డిప్యుటేషన్ రద్దు చేయాలని యూటీఎఫ్ రంపచోడవరం అధ్యక్షుడు సనాతన బాబు కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రతినిధులు కృష్ణ, శామ్యూల్, తాతాజీ, అనంతకుమారి, సత్యనారాయణ, సీపీఎం నాయకుడు లోతా రామారావు, విద్యార్థి సంఘాల జేఏసీ గౌరవ అధ్యక్షుడు ఐవీ రమణ పాల్గొన్నారు.

కోడిపందాల స్థావరంపై పోలీసుల దాడి

- ఆరుగురి అరెస్టు
- రూ.11,600 నగదు, 8 కోడిపుంజులు స్వాధీనం



నిందితులతో సీలేరు పోలీసులు

సీలేరు: గూడెంకొత్తవీధి మండలం ధారకొండకు సమీపంలో కోడిపందాలు నిర్వహిస్తున్న స్థావరంపై సీలేరు పోలీసులు సోమవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఆరుగురు పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.11,600 నగదు, 8 కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ రవీంద్రనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర-ఒడిశా సరిహద్దు నుంచి చాలా మంది కోడిపందాల నిమిత్తం ధారకొండ వస్తున్నారన్నారు. పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించి పందెంరాయుళ్లను అరెస్ట్ చేశామన్నారు. కోడిపందాలు, పేకాట నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

క్లుప్తంగా

నాణ్యమైన విద్య అందించాలి

- అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

హుకుంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆదేశించారు. మండలంలోని ఉప్ప, జి.బొడ్డాపుట్టు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఆయా పాఠశాలల్లో రికార్డులను పరిశీలించారు. విద్యాబోధన, వారి సమస్యలను తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నా లేదా అనే అంశాన్ని పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం పట్టం పంచాయతీ డాబవలసలో పర్యటించారు. ఇటీవల వర్షాలకు వంతెన కొట్టుకుపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు వాపోయారు. దీనిపై వెంటనే ఆయన కలెక్టర్, ఐటీడీఏ పీవోలతో ఫోన్లో మాట్లాడారు. ట్రైబల్ వెల్ఫేర్ నిధులను బ్రిడ్జి నిర్మాణానికి కేటాయిస్తామని అధికారుల చెప్పినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

జనవరి నెలాఖరుకు హెలికాప్టర్ మ్యూజియం



పనులను పరిశీలిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ : బీచ్ రోడ్డులో ఏర్పాటుచేస్తున్న నేవల్ హెలికాప్టర్ మ్యూజియం జనవరి నెలాఖరు నాటికి అందుబాటులోకి వస్తుందని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్ తెలిపారు. మంగళవారం హెలికాప్టర్ మ్యూజియం, మల్టీలెవెల్ కార్‌పార్కింగ్ పనులను వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూహెచ్3హెచ్ హెలికాప్టర్ మ్యూజియం పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. అలాగే సిరిపురం జంక్షన్‌లో నిర్మాణంలో ఉన్న మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ ప్రాజెక్టు పనులను కూడా వేగంగా పూర్తి చేసి త్వరలోనే ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఈ పర్యటనలో పర్యవేక్షక ఇంజనీర్ బలరామరాజు, కార్యనిర్వాహక ఇంజనీర్లు సుధీర్, దుర్గాప్రసాద్, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ కార్తీక్ పాల్గొన్నారు.

మన్యంపై చలి పంజా

అరకు వ్యాలీలో 5.3, జి.మాడుగులలో 6.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు



చలి మంట కాగుతున్న గిరిజనులు



ఎటపాక ప్రాంతంలో చలికాగుతున్న విద్యార్థులు

చింతపల్లి: మన్యంలో రోజురోజుకు చలితీవ్రత పెరుగుతోంది. మంగళవారం అరకువ్యాలీలో 5.3 డిగ్రీలు జి మాడుగులలో 6.2 డిగ్రీలు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయినట్లు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. అదేవిధంగా పాడేరు డివిజన్ పరిధిలోని జీకేవీధిలో 7.2, హుకుంపేటలో 7.4, చింతపల్లిలో 7.5, ముంచంగిపుట్టు, పెదబయలులో 9.7,అనంతగిరిలో 10.3, కొయ్యూరులో 12.1 డిగ్రీల చొప్పున నమోదయ్యాయని ఆయన వివరించారు. రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు మరింత కనిష్ట స్థాయికి చేరుకోవడంతో సాయంత్రం 4 గంటల నుంచి చలి గాలులు వీస్తున్నాయి. దీంతో ఉన్ని దుస్తులు లేకుండా బయటకు రాలేకపోతున్నారు. సాయంత్రం వేళల్లో చలిగాలుల నుంచి ఉపశమనం పొందేందుకు చలి మంటలను ఆశ్రయిస్తున్నారు. ఉదయం 10 గంటల వరకు మంచు తెరలు వీడటం లేదు.

చిరుజల్లుల్లా మంచు

ఎటపాక: చలి ప్రభావం ఎక్కువగా ఉంది. నాలుగు రోజుల నుంచి మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తెల్లవారు జామునుంచి మంచు తుంపరలు చిరు జల్లులను తలపిస్తున్నాయి. ఉదయం 10 గంటల వరకు మంచు తెరలు వీడటం లేదు.

గురుకుల విద్యార్థుల ఆందోళన

- ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్ అధ్వర్యంలో భారీ ర్యాలీ
- అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో విద్యార్థుల ర్యాలీ

జి.మాడుగుల: గిరిజన గురుకులాల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో వారు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె రాజశేఖర్, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మన్నపడాల్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జీవన్‌కృష్ణ మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయ విధానం అనేది ఎక్కడా లేదని, గిరిజన గురుకులం విద్యాసంస్థల్లోనే ఎందుకు అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. సమాన పనికి సమాన వేతనం అందించాలని చట్టం ఉన్నప్పటికీ ఈ విధానాన్ని ప్రభుత్వం ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ ఉద్యోగ భద్రత కల్పించకుండా ప్రభుత్వ అన్యాయం చేస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.2022 సీఆర్పీ ప్రకారం జీతాలు చెల్లించాలని, న్యాయపరమైన కోర్కెలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఏజెన్సీ 11మండలాల్లో ఉన్న ఏపీఆర్ పాఠశాల, కళాశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు బుధవారం పాడేరులో దీక్షలు చేపట్టిన గిరిజన గురుకులాల ఉపాధ్యాయ, అధ్యాపకులకు సంఘీభావం తెలియజేయాలని వారు కోరారు. గత 30 రోజులుగా పాడేరు ఐటీడీఏ ఎదుట గురుకులాల ఉపాధ్యాయులు దీక్షలు చేపట్టినా ఇప్పటి వరకు అధికారులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడం సిగ్గుచేటని వారు విమర్శించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. విద్యార్థి సంఘ నాయకులు కార్తీక్, తనిష్, గిరిజన సంఘం మండల ప్రతినిధులు దీనబంధు, వీరన్నపడాల్ పాల్గొన్నారు.

గిరిజన మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ భార్గవి



వీడీవీకే ఉత్పత్తులను పరిశీలిస్తున్న గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు భార్గవి

కొమ్మాది(విశాఖ): వన్‌దన్ వికాస కేంద్రాల (వీడీవీకే) సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెంది, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు ఎస్.భార్గవి ఆకాంక్షించారు. పాడేరు, పార్వతీపురం, సీతంపేట, కె.ఆర్.పురం ఐటీడీఏల ప్రాజెక్టు అధికారులు, వెలుగు అధికారులు, జీసీసీ అధికారులకు రుషికొండలోని గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ భవన్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. వన్‌దన్ వికాస కేంద్రాల నిర్వహణ, సభ్యులకు అందించిన శిక్షణ, ఉత్పత్తులు, భవన నిర్మాణాలు, మౌలిక యంత్ర పరికరాల కొనుగోలుపై సమీక్షించారు. వివిధ వీడీవీకేలు చేస్తున్న ఉత్పత్తులను, మార్కెటింగ్ సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ వీడీవీకేలను బలోపేతం చేయాలని, సేకరించిన అటవీ ఉత్పత్తులకు అదనపు విలువలు జోడించి మంచి బ్రాండింగ్ చేయాలని సూచించారు. విస్తరాకులతో తయారు చేసిన వస్తువులను సింహాచలం, టీటీడీ దేవస్థానాలకు సరఫరా చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. పీఎం జన్‌మన్ ద్వారా మంజూరు చేసిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలో 106 వీడీవీకేలు ఉన్నాయని రూ.3.1 కోట్లతో యంత్రపరికరాలు సమకూర్చి, సభ్యులకు శిక్షణ ఇచ్చామని చెప్పారు. రూ.1.50 కోట్లకు యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పించామని, 36 వీడీవీకేల ద్వారా ఉత్పత్తులు ప్రారంభించినట్టు తెలిపారు. కార్యక్రమంలో జీసీసీ ఎండీ కల్పనాకుమారి, పీవోలు కట్టా సింహాచలం, అపూర్వ భరత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసదొర

రంపచోడవరం: గ్రామాల అభివృద్ధికి అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని రంపచోడవరం ఎంపీడీవో సుండం శ్రీనివాసదొర తెలిపారు. రంపచోడవరంలో రెండు రోజుల పాటు గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామస్థాయి అధికారులు, సర్పంచ్‌లకు శిక్షణ నిర్వహించనున్నారు. మొదటి రోజు మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, డీఎల్‌డీవో కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల రైతులకు ప్రోత్సాహకాలు



మునిరిలో రైతులతో మాట్లాడుతున్న ఉద్యానవనశాఖ, వ్యవసాయ అధికారులు శిరీష, నీలవేణి

దుంబ్రిగుడ: కూరగాయలు పండించే రైతులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్టు ఉద్యానవనశాఖ అధికారి శిరీష తెలిపారు. మండలంలోని అరమ పంచాయతీ మునిరిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారి నీలవేణి, ఉద్యానవనశాఖ అధికారి శిరీష ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా శిరీష మాట్లాడుతూ కూరగాయల విత్తనాల కొనుగోలుపై 50 శాతం సబ్సిడీ అందజేస్తున్నట్టు చెప్పారు. పవర్ టిల్లర్లు కొనుగోలు చేసిన రైతులకు ప్రభుత్వం రూ. 65 వేలు అందజేయనున్నట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న అధికారి విజయలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పోలయ్య, చంద్రదాసు, గిరిజన రైతు టి.రాందాసు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదం కేసులో డ్రైవర్‌కు పదేళ్ల జైలు

గూడెంకొత్తవీధి : గూడెంకొత్తవీధి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్వీనగర్ వద్ద నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపి ఆరుగురి మరణానికి కారణమైన డ్రైవర్‌కు పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ విశాఖపట్నం 12వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి తీర్పు ఇచ్చారని గూడెంకొత్తవీధి సీఐ వరప్రసాద్ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలివి. 2017 ఏప్రిల్‌లో మండలంలోని ఆర్వీనగర్ గ్రామంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నడుస్తున్న వాహనాన్ని డ్రైవర్ వదిలి పరారవ్వడంతో ఆ లారీ నేరుగా ఒక దుకాణంపైకి దూసుకు వెళ్లింది. ఈ ఘటనలో ఏకంగా ఆరుగురు వ్యక్తులు మరణించారు. దీనిపై గూడెంకొత్తవీధి పోలీస్‌స్టేషన్‌లో వివిధ సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేశారు. ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరి జిల్లా తర్లకోట కు చెందిన డ్రైవర్ హల్దార్(26) ప్రమాదానికి కారణమైనట్టు చార్జిషీటు దాఖలు చేశారు. అప్పటి చింతపల్లి డీఎస్పీ వులిపాటి అనిల్ కుమార్ నేతృత్వంలో ఈ కేసు విచారణ జరిగింది. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.వీరభద్రరావు కేసును వాదించారు. కోర్టులో ప్రభుత్వం, పోలీసుల తరపున ప్రవేశపెట్టిన సాక్షాలు నిజమని తేలడంతో నిందితుడు హరి హల్దార్‌కు విశాఖపట్నం 12వ అదనపు జిల్లా న్యాయస్థానం 10 సంవత్సరాల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడించారని సీఐ తెలిపారు.

వరి కోతలు వాయిదా వేసుకోండి

ఆర్ఏఆర్ఎస్ సూచన



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీలత

అనకాపల్లి : వర్ష సూచన ఉన్నందున్న, వరి కోతలను వాయిదా వేసుకోవాలని, ఒక వేళ ఇప్పటికే పైరును కోసి ఉంటే కుప్పలుగా పెట్టుకుని టార్పాలిన్ పరదా కప్పాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఇన్‌ఛార్జ్ ఏడీఆర్ టి.శ్రీలత అన్నారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వర్షాల అనంతరం 12–14 రోజుల వయసుగల రబీలో వేసిన వరిలో 2.5 కిలోల యూరియాను వేసుకోవాలని, నారును పీకే వారం రోజుల ముందు కార్బోఫ్యూరాన్ గుళికలను 5 సెంట్ల నారుమడికి 800 గ్రా.చొప్పున వేసుకోవాలన్నారు. వర్ష సూచన ఉన్నందున రాగులు, మొక్కజొన్న, నువ్వులు, అపరాలు, వేరుశనగ వంటి రబీపైరులను విత్తుకోవడం వాయిదా వేసుకోవాలని, వర్షాల అనంతరం తేమను ఉపయోగించుకుని పైరులను వేసుకోవచ్చన్నారు. ఒక వేళ ఇప్పటికే రబీ పంటలు వేసిన వర్షాల వల్ల పొలంలో నీరు చేరినట్టయితే బయటికి తీసే ఏర్పాటు చేయాలన్నాని చెప్పారు. కూరగాయ పంటల్లో కూడా అధిక నీరు చేరినట్టయితే వీలైనంత త్వరగా నీటిని బయటికి తీసివేయాలని, కుళ్లు తెగుళ్లు రాకుండా నివారణ చర్యగా కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను లీటరు నీటికి 3 గ్రా.చొప్పున కలిపి మొక్కల మొదళ్ల వద్ద నేల తడిచేల పిచికారి చేయాలన్నారు. వీలైనంత త్వరగా పక్వతకు వచ్చిన కూరగాయలను కోసి మార్కెట్‌కు తరలించాలన్నారు.

ఇసుకపై ఆంక్షలు ఎత్తివేయాలి



అటవీశాఖ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ప్రజాప్రతినిధులు, గిరిజనులు

చింతపల్లి: మండలంలో ఆదివాసీ గిరిజనులు సేకరించి, రవాణా చేస్తున్న ఇసుకపై పూర్తిగా ఆంక్షలు ఎత్తివేయాలని మాజీ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు వంతల బాబూరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రం చింతపల్లిలోని అటవీశాఖ కార్యాలయం వద్ద ప్రజాప్రతినిధులు, గిరిజనులతో కలసి మంగళవారం ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో లోతుగెడ్డ, లింగాలగుడి, పిసిరిమామిడి,చెరుకుంపాకలు,కోటగున్నలు,పాలంబంద,నిమ్మపాడు,గుంజివీధి,భీమసింగి తదితర కొండ వాగుల నుంచి ఇసుకను సేకరించి గృహ నిర్మాణ అవసరాలతో పాటు గ్రామాల్లో సీసీ రోడ్లు ,డ్రైనేజీల నిర్మాణానికి ఉపయోగిస్తున్నట్టు చెప్పారు. ఉచితంగా ఇసుక ఇస్తున్నట్టు ప్రభుత్వం చెబుతుంటే అటవీశాఖ అధికారులు మాత్రం ఇసుక తరలింపుపై ఆంక్షలు విధించడం ఎంత వరకు సమంజసమని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు రోజుల కిందట ఇసుక తరలిస్తున్న వ్యాన్‌లను లోతుగెడ్డ రేంజ్ అధికారులు పట్టుకుని, ఇప్పటికీ విడిచిపెట్టకపోవడం ఏంటని ప్రశ్నించారు.మన్యంలో ఇసుకను ఉచితంగా రవాణా చేసుకునే విధంగా కలెక్టర్, ఐటీడీఏ పీవో చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లోతుగెడ్డ సర్పంచ్ చింతర్ల సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన సాయిచందర్



తీవ్రంగా గాయపడిన అఖిల్‌కు చింతపల్లి ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్న వైద్యసిబ్బంది

చింతపల్లి: చింతపల్లి పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో మంగళవారం పలు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. పోలీసులు, చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రి వైద్యులు అందించిన వివరాల ప్రకారం మంగళవారం ఉదయం కొయ్యూరు మండలం బూదరాళ్ల ఘాటీలో ద్విచక్రవాహనం అదుపుతప్పిన ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. రాజవొమ్మంగి మండలం శరభవరం గ్రామానికి చెందిన కాపూరి అఖిల్, సాయిచందర్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో ఆయన్ను మైదానప్రాంతానికి తరలించారు. మరో ప్రమాదంలో పెంటపాడు అంతర్ల గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో చెదల రాజ్‌కుమార్ గాయపడ్డారు. జడుమూరు వద్ద జరిగిన ప్రమాదంలో వంతల కృష్ణ, గుంట చిన్నబ్బాయిలు గాయపడ్డారు. వీరికి చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రిలో వైద్యం అందిస్తున్నారు.

వర్ష సూచనతో అన్నదాతల్లో ఆందోళన



రాజవొమ్మంగిలో వరి పంటను కుప్పలుగా వేస్తున్న రైతులు



వరి కుప్పలపై కప్పిన టార్పాలిన్

రాజవొమ్మంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో బుధ, గురువారాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలియజేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం రంపచోడవరం డివిజన్‌లో వాతావరణంలో మార్పు కనిపించింది, ఆకాశం మేఘావృతమైంది. వరి పంట కోతలు కోస్తున్న సమయంలో వర్షాలు పడితే నష్టం తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు. రాజవొమ్మంగి మండలంలో సుమారు 6,500 ఎకరాల్లో ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి సాగుచేశారు. ఇప్పటి వరకు సగం విస్తీర్ణంలో మాత్రమే కోతలు పూర్తయ్యాయి. మరోవైపు కోసిన పంటను గట్లపైకి తెచ్చి కుప్పలు వేస్తున్నారు. ఈ తరుణంలో వర్షాలు పడితే తమ పరిస్థితి ఏంటని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటను రక్షించుకునే చర్యలు ప్రారంభించారు.

ముగిసిన ప్రణాళిక శిక్షణ



శిక్షణ కార్యక్రమం ముగింపులో ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు



శిక్షణ కార్యక్రమంలో ప్రణాళికలు గురించి వివరిస్తున్న బ్యాంక్ మేనేజర్ జగదీష్ కుమార్

గంగవరం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక ప్రజా ప్రతినిధులకు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి సుస్థిర అభివృద్ధి , పంచాయతీ రాజ్ అభివృద్ధి ప్రణాళికపై రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం మంగళవారం విజయవంతంగా ముగిసింది. ముంగింపు కార్యక్రమానికి ఎంపీడీవో పీజీ రామకృష్ణ అధ్యక్షత వహించారు. తహసీల్దార్ శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ డీఎల్‌పీవో నరసింగరావు, ఉపాధి ఏపీవో ప్రకాష్ , నీతి అయోగ ప్రతినిధి ఎల్.హేమ మాధురి, స్టేట్‌బ్యాంక్ మేనేజర్ జగదీష్‌కుమార్, సీడీపీవో లక్ష్మి, వెలుగు ఏపీఎం షణ్ముఖరావు తదితరులు అవగాహన కల్పించారు. వైస్ ఎంపీపీలు గంగాదేవి, రామతులసి, ఎంపీటీసీ సభ్యులు పద్మావతి, కనకలక్ష్మి, వెంకటలక్ష్మి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆడపిల్ల పుట్టిందని వేధింపులపై ఫిర్యాదు

మునగపాక: అదనపు కట్నంతో పాటు ఆడపిల్ల పుట్టిందన్న నెపంతో తన భర్త ఇల్లు విడిచి వెళ్లిపోయాడని ఓ వివాహిత మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు మునగపాక పోలీసులు కేసు నమోదు చేశారు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వాడ్రాపల్లికి చెందిన అనసూరి లక్ష్మీనారాయణతో నూకరత్నంకు 2022లో వివాహమైంది. వీరికి ఓ ఆడపిల్ల పుట్టింది. ఆడపిల్ల పుట్టిందని, ఇందు కోసం అదనపు కట్నం తేవాలంటూ భర్తతో పాటు అత్త అప్పలనరస తరచూ వేధించడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో నాలుగు నెలల క్రితం తన భర్త లక్ష్మీనారాయణ తనను, తన కుమార్తెను విడిచి ఎక్కడికో వెళ్లిపోయాడని, తనకు న్యాయం చేయాలని కోరుతూ నూకరత్నం పోలీసులను ఆశ్రయించింది. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఫిబ్రవరిలోగా పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలి



మాట్లాడుతున్న ఖజానా శాఖ అధికారి సుభాషిణి

అనకాపల్లి: ప్రభుత్వ పెన్షన్‌దారులు లైఫ్ సర్టిఫికెట్ సమర్పణకు జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28వ తేదీలోపు ఆన్‌లైన్లో నమోదు చేసుకోవాలని, లేని పక్షంలో ఏప్రిల్ నుంచి పెన్షన్ నిలుపుదల చేస్తామని జిల్లా ఖజానా అధికారి వి.ఎల్.సుభాషిణి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక నర్సింగరావుపేట ఏపీటీఎఫ్ భవనంలో జాతీయ పింఛనుదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పెన్షనర్ల పితామహుడు డి.ఎస్.నకారా చిత్రపటానికి ఆమె పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇన్‌కమ్ ట్యాక్స్ పరిధిలో పెన్షనర్లు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ట్యాక్స్ చెల్లించాలని కోరారు. పెన్షనర్ల సమస్యలు ఉన్నట్లయితే తమ కార్యాలయంలో దిగువ స్థాయి సిబ్బందిని కలిసి పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం 80 సంవత్సరాలు పైబడిన 10 మంది పెన్షనర్లను సంఘం సభ్యులు శాలువాలతో సత్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వద్దాది జగన్నాథరావు, కార్యదర్శి బి.ఎల్.ఎన్.శర్మ, కోశాధికారి కె.సత్యారావు, గౌరవాధ్యక్షుడు కె.సుబ్రహ్మణ్యం, విశ్రాంత డిప్యూటీ డీఈవో కె.వి.గౌరీపతి, పింఛనుదార్లు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు మానవాళికి మార్గదర్శకాలు



క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర



గిరిజనులకు రగ్గులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



పాడేరులో ప్రార్థన చేస్తున్న పాస్టర్ జాన్‌వెస్లీ

ముంచంగిపుట్టు: క్రీస్తు బోధనలు మానవాళికి మార్గదర్శకాలని ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ కెందుగూడలో మంగళవారం గ్రాండ్ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుభద్ర మాట్లాడుతూ కెందుగూడ గ్రామ ప్రజలు మంచి ఆలోచనలతో దైవమార్గంలో నడవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు,వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు పద్మారావు,సర్పంచ్ త్రినాథ్, ఎంపీటీసీలు కమల,నబ్బో,పాస్టర్లు మోహన్, జగన్నాథం, బర్నిబాష్, సురేష్, ప్రసాద్, జాను పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

హుకుంపేట: ప్రపంచ మానవాళికి క్రీస్తు బోధనలు అనుసరణీయమని అరుకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తెలిపారు. దుర్గం పంచాయతీ కొత్తవలసలో మంగళవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు.అనంతరం పేదలకు రగ్గులు,దుస్తులు,బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సాంబ,దైవసేవకులు పాల్గొన్నారు.

పాడేరురూరల్(అరకులోయరూరల్): పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బుధవారం యునైటెడ్ క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యూసీవైఏ వ్యవస్థాపకుడు జాన్ రీమలి అధ్యక్షతన క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాజమండ్రి హోసన్నా మినిస్ట్రీస్ అంతర్జాతీయ ప్రసంగీకులు, గాయకుడు పాస్టర్ జాన్‌వెస్లీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో ఉండాలన్నారు.వేడుకల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు బత్తిరి రవిప్రసాద్, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు సామ్యూల్, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ కిల్లో రమేష్‌నాయుడు, పాస్టర్లు ఎలీషారావు,చిన్నిసైమాన్,సత్యరావు,శ్రీనివాస్,రవి,అరుణ్, సంజీవ్,గ్లోరియస్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.